

# ప్రజాజ్యోతి

## ఖమ్మం

శుక్రవారం 22-3-2024 పేజీలు : 6

## బోన్ క్యాన్సర్‌కు చికిత్స ఉంది

- ఏ క్యాన్సర్ అయినా ఉపశమనం పొందవచ్చు
- క్యాన్సర్ స్పెషలిస్ట్, బ్లడ్ డిజార్డర్స్ స్పెషలిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల

4





# వడ్ల కొనుగోళ్లకు సిద్ధం

- జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణకు కసరత్తు పూర్తి
- 190 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 2.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- ఉగాది తర్వాత ప్రారంభానికి చర్యలు

ఖమ్మం, మార్చి 19:
జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా వరి కోతల సమయం దగ్గరపడు తుండడంతో ధాన్యం సేకరణకు సంబంధించిన యాక్షన్‌ను సిద్ధం చేసుకున్నారు. గత యాసంగి సీజన్‌లో మాదిరిగానే ఈ సీజన్‌లోనూ జిల్లావ్యాప్తంగా 190 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ధాన్యం సేకరణ, రవాణా, బిల్లుల చెల్లింపు వంటి అంశాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటు న్నారు. జిల్లాలో కత్తెర పంట కోతకు రాగా యాసంగి పంట మరో 15-20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. కొన్ని చోట్ల 15-20 రోజుల్లో కోతలు ప్రారంభం కానుండగా కొన్ని చోట్ల నెల రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉగాది తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. కాగా.. జిల్లావ్యాప్తంగా ధాన్యం దిగుబడి అంచనా, కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్, డ్రయ్యర్లు, టార్పాలిన్ కవర్లు ఎంత మేర అవసరమవుతాయనే అంచనాకు వచ్చి సిద్ధంగా ఉంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎలాంటి హడావిడి లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

# పార్లమెంట్ ఎన్నికల తరువాత నేనే సీఎం అనడం ఊహాజనితం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




ఖమ్మం మార్చి 21 ప్రజాజ్యోతి
పార్లమెంట్ ఎన్నికల తరువాత నేనే సీఎం అనడం ఊహాజనితమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పళ్ళు ఉన్న చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్లు, నా దగ్గర పండ్లు ఉన్నాయి అందుకే ఈ దుష్ప్రచారం అని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి వెంట రోజు ఉంటే నేను నంబర్ 2 ఎలా అవుతాను, నాతోపాటు ఇతర మంత్రులు కూడా ఉన్నారు మరి దాన్ని ఎలా చూస్తారు. హైకమాండ్ కూడా నేను సీఎం కావాలంటే కొన్ని ఈక్వేషన్స్ చూస్తుంది కదా..! ఆ మాత్రం జ్ఞానం కూడా లేదా ఈ తప్పుడు ప్రచారం చేసేవారికి, నేను సీఎం కావాలని అనుకోవట్లేదు.. అలాంటి ఆలోచన నాకు లేదు అని అన్నారు. ఎవ్వరికీ (బీజేపీ) టచ్ లోకి వెళ్ళలేదు. వెళ్ళను కూడా నన్ను నమ్మిన వారికి నన్ను ఆదరించిన వారికి ఎప్పటికీ నేను ద్రోహం చేయను. నా ప్రయాణం కాంగ్రెస్ తోనే... అదంతా గ్లోబల్స్ ప్రచారం ఇలాంటి వాటికి నేను ఎన్నడూ భయపడలేదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మా ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయదు. అని వారు వివరించారు.

### భారత జాతీయ టెన్నిస్ జట్టులో స్థానం దక్కించుకున్న

# ఖమ్మంకి చెందిన యామలపల్లి సహజ



**ఖమ్మం కల్చరల్ మార్చి 21 ప్రజాజ్యోతి**
చిన్నతనంలో స్నేహితులతో కలిసి సరదాగా రాకెట్ పట్టిన ఆ చిన్నారి... పదేండ్లు వచ్చేసరికి టెన్నిస్ నే కెరీర్ గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. టెన్నిస్ లో శిక్షణ ప్రారంభించిన ఆ అమ్మాయి అంచెలంచెలుగా ఎదుగుతూ, భారత జాతీయ జట్టులో స్థానం దక్కించుకుంది. ఆ అమ్మాయి ఖమ్మం కు చెందిన యామలపల్లి సహజ.సహజ తల్లిదండ్రులు యామలపల్లి భవానీప్రసాద్-సుప్రియలు. ఖమ్మం వాస్తవ్యులైన వీరు, హైదరాబాద్ లోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగ నిమిత్తం మకాం హైదరాబాద్ కు మార్చారు. సహజ పదో తరగతి వరకు హైదరాబాద్ లోని విజ్ఞాన్ స్కూల్లో, ఇంటర్ సిద్ధార్థ్ జూనియర్ కళాశాలలో చదివారు. పదో ఏట నుండే టెన్నిస్ శిక్షణ ప్రారంభించిన సహజ ఇంటర్ తర్వాత ఇండియా నేషనల్ ర్యాంకింగులో 20వ స్థానం పొందారు. స్పోర్ట్స్ కోటాలో వంద శాతం స్కాలర్ షిప్ తో అమెరికాలో డిగ్రీ చదువుటకు అర్హత పొంది, టెక్సాస్ లోని సామ్ హౌస్టన్ స్టేట్ యూనివర్సిటీలో ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్ లో డిగ్రీని పూర్తి చేశారు. సహజలో టెన్నిస్ పై ఆసక్తిని గమనించిన ఆమె తండ్రి భవానీప్రసాద్, ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగం వదులుకొని, పూర్తి స్థాయిలో తన కుమార్తె కెరీర్ పై దృష్టి పెట్టారు. డిగ్రీ పిదప స్వదేశానికి చేరుకున్న సహజ టెన్నిస్ పై పూర్తి దృష్టి పెట్టారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సహజ మొదట టెన్నిస్ శిక్షణ కు ఖర్చు భరించలేక వేయి రూపాయల ఫీజుతో, యూ ట్యూబ్ చూస్తూ, టెన్నిస్ శిక్షణ పొందారు. గత రెండు సంవత్సరాలుగా బెంగుళూరు పిబిఐ అకాడమీలో కోచ్ సీజర్ మొరాల్స్ వద్ద శిక్షణ పొందుతున్నారు. 2021 సంవత్సరంలో ప్రపంచ ర్యాంకింగులో 1300 స్థానంలో ఉన్న సహజ, రెండేళ్ల శిక్షణ లో రాటుదేలి, తన ర్యాంకింగును మెరుగుపర్చుకొని, ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగులో 306, నేషనల్ ర్యాంకింగులో నెంబర్ 2, తెలంగాణా ర్యాంకింగులో నెంబర్ 1 గా వున్నారు.టెన్నిస్ కెరీర్ లో కళాశాల స్థాయిలో 2017 నుండి 2021 వరకు మూడు సార్లు సౌత్ ల్యాండ్ కాన్ఫరెన్స్ ఉమెన్ టెన్నిస్ ప్లేయర్ గా, టెక్సాస్ రీజియన్ మహిళా టెన్నిస్ ప్లేయర్ గా 18వ ర్యాంక్, ఐటిఏ/ఎన్ సిఏఏ నేషనల్ ర్యాంకింగ్ సాధించిన మొదటి ప్లేయర్ గా చరిత్రలో నిలిచారు. ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడలో సహజ రాణిస్తున్నారు. ఐటీఎఫ్ 2023 టైటిల్, ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్స్ (2021-2022) సాధించారు. వచ్చే నెలలో చైనాలో జరిగే బిలీజియన్ కింగ్ కప్ ప్రపంచ స్థాయి పోటీలకు భారత్/తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహించనున్నారు.టెన్నిస్ క్రీడ సంపన్నుల క్రీడ. శిక్షణ చాలా ఖర్చుతో కూడుకున్నది. సంవత్సరానికి కనీసం 30 లక్షలు ఖర్చు అగుతుంది. మధ్య తరగతికి చెందిన సహజ లో నైపుణ్యం, ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక వనరుల అవసరం ఎక్కువగా వుంది. అంతర్జాతీయ టోర్నీలు ఆడడం ఖర్చుతో కూడుకున్న పని. ఈ ఇబ్బంది వల్లే, ఆరంభంలో సహజ ఎక్కువ టోర్నీల్లో ఆడలేకపోయారు. స్పాన్సర్లు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్థిక అండ లభిస్తే, మెరుగైన ఫలితాలు సాధిస్తాననే నమ్మకం సహజ లో ఉంది. స్పాన్సర్లు ముందుకు వచ్చి, సహజ కు అండగా నిలబడితే మన ఖమ్మం, తెలంగాణ నుండి జాతీయ స్థాయికి ఎదిగిన ఈ ఆణిముత్యం అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్ రంగాన్ని శాసిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఎన్నికల నియమావళి ని తప్పనిసరిగా పాటించాలని
## ప్రింటింగ్ ప్రెస్ వారితో సమీక్ష నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి మార్చి 21 ప్రజా జ్యోతి**
లోక్‌సభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, ప్రింటింగ్ ప్రెస్, పెట్రోల్‌బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి రాజకీయ పార్టీల ప్రచార సామాగ్రి ముద్రణ పనులు చేయాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ తేది సమీపిస్తున్నందున వివిధ రాజకీయ పార్టీలు తమ పార్టీల ప్రచార సామాగ్రి ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ లకు వస్తారని, అయితే అనుమతి పొందిన వాటిని మాత్రమే ముద్రించాలని ఆయన అన్నారు. పార్టీలు తాము ప్రచురించవలసిన వివరాలకు సంబంధించిన అంశాలను నిర్దీత ప్రొఫార్మాలలో సమర్పించాలని, అట్టి వాటిని పరిశీలించి అనుమతించడం గాని, తిరస్కరించడం గాని జరుగుతుందని తెలిపారు. పోస్టర్లు గాని, కరపత్రాలు గాని, ఇతర ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రించుటకు ముందుగా ఇద్దరు వ్యక్తులు తనకు పబ్లిషర్ తెలిసినట్లుగా ధృవీకరిస్తూ ఇచ్చిన డిక్లరేషన్ కాపి రెండు పత్రాలను పబ్లిషర్ నుండి పొందిన తరువాతనే సదరు ప్రింటరు ముద్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రచురించే ప్రచార సామాగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నెంబర్, ప్రచురణ ప్రతుల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా వివరాలు తప్పని సరిగా ముద్రించాలని తెలిపారు. ముద్రితమైన ప్రచార సామాగ్రి ప్రతి పై ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్ తో పాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య, ప్రింటింగ్ చేయడానికి వసూలు చేసిన మొత్తం (ధర)కు సంబంధించిన వివరాలను సమర్పించాలని ఆయన తెలిపారు. ప్రింటింగ్, పబ్లిషర్ పేరు లేకుండా ఎన్నికల అంశాలతో ముడిపడిన పోస్టర్లు, కరపత్రాలు,ఇతర ప్రచార సామాగ్రిని ముద్రించినా, నిర్దేశించిన సంఖ్యకు మించి ముద్రించినా ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ప్రజాప్రాతినిధ్య చట్ట ప్రకారం చర్యలకు గురి కావాల్సి ఉంటుందని అన్నారు. పెట్రోల్ బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులు రోజువారి లావాదేవీల వివరాలు, డబ్బు లావాదేవీలు జరిపే వారి వివరాలు తెలియజేసి వాటికి సంబంధించిన విక్రయాలు నగదుకు సంబంధించి వివరాలు తెలియాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి మురళీధర్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ ప్రింటింగ్ ప్రెస్, పెట్రోల్ బంక్, గోల్డ్ షాపుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిబంధనలను పటిష్టంగా

## అమలు చేయాలి : ఆర్డీఓ గణేష్



**ముదిగొండ మార్చి 21(ప్రజాజ్యోతి)**
సార్వత్రిక ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని ఆర్డీఓ,మధిర నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి జి గణేష్ అన్నారు.ముదిగొండ తాసిల్దార్ కార్యాలయంలో సెక్టోరల్,పోలీస్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆర్డీఓ గణేష్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.వాహనాల తనిఖీ విస్తృతంగా చేపట్టాలన్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డిఓ గుంటూరు గణేష్ హెచ్చరించారు.ఈసమావేశంలో తాసిల్దార్ ఎర్రపాటి రామారావు,ఎంపిడిఓ ఎస్ శ్రీధర్ స్వామి, ఎస్సై గజ్జెల నరేష్,ఎంపిఓ పి సూర్యనారాయణ, ఏఓ మందుల రాధ,నీటిపారుదల శాఖ డిఇ జె పెద్ద రాంబాబు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ అభియాన్‌లో సామూహిక శ్రీమంతాలు



**ఎర్రుపాలెం, మార్చి21, ప్రజాజ్యోతి:**
మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని రైతు వేదికలో పోషణ అభియాన్, పోషణ్ పక్వాడ లో భాగంగా ఐసిడిసి, సిడిపిఓ, ఏసి శారద శాంతి, ఏసిడిపి ఓ కృష్ణ శ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రసనలు, అక్షరాభ్యాసాలు, గర్భిణీ, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, మూడు నుండి ఏడు సంవత్సరాల పిల్లలకు అదనపు ఆహారం, పూర్వ ప్రాథమిక విద్య గురించి స్టాల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల సూపర్వైజర్ శశి షర్మిలాదేవి, వెంకటరమణ, సరిత, బనిగండ్లపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురునాథరెడ్డి, తల్లిదండ్రులు, ప్రాజెక్టు సూపర్వైజర్స్, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, ఆశ వర్కర్లు మొదలగువారు పాల్గొన్నారు.

## మండల పాస్టర్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా ఏసురత్నం



బోనకల్, మార్చి 21, ప్రజా జ్యోతీ:మండలంలోని పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవం జరిగింది. స్థానిక వృద్ధాశ్రమంలో పి రాజారత్నం,బి ఎర్నెస్ట్ పాల్, మహిళా అధ్యక్షురాలు బి జీవమ్మ, మధిర నియోజకవర్గ సెక్రెటరీ కే డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జి ప్రవీణ్ (ముష్టికుంట్ల),అధ్యక్షులుగా ఎస్ ఏసురత్నం (తూటి కుంట్ల), ఉపాధ్యక్షులుగా పి శ్యాము (రాయన్నపేట),కార్యదర్శిగా వి భరత్ (ముష్టికుంట్ల), ట్రెజరి బి అబ్రహం (రావినూతల) లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఏసురత్నం మాట్లాడుతూ క్రైస్తవులకు, సంఘం పాస్టర్లకు గల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా పని చేస్తామని అన్నారు.ఈ సమావేశానికి మండల దైవజ్ఞులు,సంఘ కాపరులు ఎం పౌలు,డేవిడ్, రత్నబాబు,బాబురావు,ఎం అబ్రహం,ఎం జోసఫ్,సామేలు పాల్గొన్నారు.

# బోన్ క్యాన్సర్ కు చికిత్స ఉంది

- ఏ క్యాన్సర్ అయినా ఉపశమనం పొందవచ్చు
- క్యాన్సర్ స్పెషలిస్ట్, బ్లడ్ డిజార్డర్స్ స్పెషలిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల




**ఖమ్మం, మార్చి 21 ప్రజాజ్యోతి**
బోన్ క్యాన్సర్ కు చికిత్స ఉందని, తొలిదశలో నిర్ధారణ చేస్తే క్యాన్సర్లు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సక్సెస్ రేట్లు 90శాతం మించి ఉంటాయని క్యాన్సర్ స్పెషలిస్ట్ యశోద హాస్పిటల్ సోమాజిగూడ వైద్యులు డాక్టర్ హరీష్ కంచర్ల అన్నారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. బోన్ క్యాన్సర్‌పై విజయం సాధించిన విజేతలతో క్యాన్సర్ సర్వైవర్స్ సమ్మిట్ నిర్వహించారు. "క్యాన్సర్‌ల గురించి అవగాహన కల్పించడానికి, 'క్యాన్సర్‌లు పూర్తిగా నయం కావడమే కాకుండా, విజయవంతం అయిన తర్వాత రోగులు సాధారణ జీవితం కొనసాగించవచ్చు అనే వాస్తవాన్ని నొక్కిచెప్పడానికి క్యాన్సర్ సర్వైవర్స్ మీట్‌ను ఖమ్మంలో నిర్వహించడం జరిగిందన్నారు. చికిత్స తర్వాత మనలాగే పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపవచ్చు అన్నారు. పేషెంట్ సర్వైవర్స్ మీట్ క్యాన్సర్ బారిన పడినవారు ముందుకు రావడానికి, వారిని ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీనియర్ క్యాన్సర్ స్పెషలిస్ట్, హెమటాలజిస్ట్ డాక్టర్ హరీష్ అన్నారు. బోన్ క్యాన్సర్ అనేది టీనేజ్ పిల్లల్లో ఎక్కువగా వస్తుందని, ఎముక మజ్జ, కార్టెక్స్ భాగాన్ని ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్ అని, ఇందులో ఆస్టియోసార్కోమా, ఎవింగ్స్ సర్కోమా, ఖాండ్రో సర్కోమా అనే రకాలు ఉంటాయన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల పూర్తిగా నయం అయ్యే అవకాశాలు గణనీయంగా ఉన్నాయన్నారు. క్యాన్సర్ పరిశోధన చికిత్సలో తాజా పురోగతిని డాక్టర్ హరీష్ వివరించారు. ప్రస్తుత తరుణంలో 2024లో వచ్చే క్యాన్సర్‌లు ఆధునిక కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, బోన్ మ్యారో, ట్రాన్స్‌ప్లాంట్ వంటి అత్యంత అధునాతన చికిత్సలతో నయం చేయవచ్చన్నారు. వాస్తవానికి టార్గెటెడ్ థెరపీలు, ఇమ్యునోథెరపీల ద్వారా ఆరోగ్యకరమైన కణాలను ప్రభావితం చేయకుండా క్యాన్సర్ కణాలను ఎంపికచేసి చంపుతాయని, తద్వారా కొన్ని రకాల క్యాన్సర్‌లకు వ్యతిరేకంగా మరింత విజయం సాధించడంతో పాటు సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఎవింగ్స్ సర్కోమాకి ట్రీట్మెంట్ చేయించుకున్న ఖమ్మం నగరానికి చెందిన 8 ఏళ్ల చిన్నారి ఆరోగ్యంగా ఉందన్నారు. పాప విషయంలో ముందుగా చెమోథెరపీ ఇచ్చి సైజ్ తగ్గిన తర్వాత క్యాన్సర్ స్టార్ట్ అయినా బోన్ పార్ట్ కి రేడియేషన్ ట్రీట్మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. గత 2 సంవత్సరాలుగా రెగ్యులర్ చెక్ అప్ చేసుకుంటూ ఆరోగ్యంగా వుందని పాప తండ్రి నరసింహారావు పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఏ క్యాన్సర్ నుండి అయినా ఉపశమనం పొందవచ్చని డాక్టర్ హరీష్ స్పష్టం చేశారు.క్యాన్సర్ స్క్రీనింగ్, క్యాన్సర్ వ్యాక్సినేషన్ గురించి ప్రజలలో అవగాహన తెప్పించడానికి మీడియా ద్వారానే సాధ్యం అవుతుందని తమవంతు కృషి చేస్తున్నామని, క్యాన్సర్ బారిన పడకుండా ప్రజలని అప్రమత్తం చేయాలని కోరుకుంటున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఖమ్మం యశోద ఆసుపత్రి మేనేజర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

## కూరగాయల తోటకు రక్షణగా వేసిన సోలార్ ప్యానల్, ఇన్వెటర్ చోరీ

**బోనకల్, మార్చి 22, ప్రజాజ్యోతి:**
మండల పరిధిలోని మోటమర్రి గ్రామ శివార్లలోని వ్యవసాయ భూమిలో దాములూరి వెంకట్రావు అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో కోతుల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ రక్షణగా ఉన్న కంచె,ఇన్వెటర్లు, కన్వర్టింగ్ మిషన్ ను గుర్తు తెలియని అగంతకులు చోరీకి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాములూరి వెంకట్రావు అనే రైతు తన వ్యవసాయ భూమి లో కూరగాయల పండిస్తాడు.గ్రామాలతో పాటు పంట పొలాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో వత్తి రక్షణ కోసం చుట్టూ పెన్సింగ్ వేసి సోలార్ ఎనర్జీ నీ తీగల ద్వారా సరఫరా చేస్తున్నాడు.ఇది గమనించిన ఆగంతకులు వాటిని ఈ నెల 15వ తేదీన దొంగిలించారు. చోరికి గురైన వాటి విలువ ముప్పై వేల వరకూ ఉంటుందని బాధిత రైతు తెలిపారు.రైతు దాములూరి వెంకట్రావు, బోనకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగినది.

## కోఆపరేటివ్ ఛైర్మన్ పదవికి భాస్కర రెడ్డి రాజీనామా

**నిజామాబాద్,మార్చి21:** నిజామాబాద్ జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్, డైరెక్టర్ పదవికి పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా చేశారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని కో ఆపరేటివ్ విభాగం కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కో ఆపరేటివ్ శాఖ కమిషనర్ కు తన రాజీనామా లేఖ పంపించారు.

తనను నమ్మి డీసీసీబీ బ్యాంక్ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన కేసీఆర్ కి ధన్యవాదాలు తెలిపారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి నాకు పార్టీ కంటే పదవి గొప్పది కాదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నామినేటెడ్ పోస్టులను రద్దు చేసింది. కార్పొరేషన్ పదవులను సైతం సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ రద్దు చేసింది. ఇటీవల 37 కార్పొరేషన్లకు హడావుడిగా ఛైర్మన్లకు సైతం నియమించింది. అయితే బీఆర్ఎస్ శ్రేణులకు సంబంధించిన మరికొందరు ఒక్కొక్కరుగా రాజీనామా చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తనయుడు పోచారం భాస్కర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు.

### చిత్రపురి కేసులో నిజాలు బయటపెట్టాలి: ఆర్ఎస్పీ

**హైదరాబాద్,మార్చి21:** చిత్రపురి సిటీలో రూ. 3 వేల కోట్ల భూదందా జరిగిందని ఆరోపణ వస్తే ఆధారాలతో స్పందించాల్సింది పోయి దౌర్జన్యంగా అక్రమ కేసు పెట్టి, సెల్‌ఫోన్‌ను సీజ్ చేయడం ఏంటి రేవంత్ రెడ్డి గారు అని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. అంటే కుంభకోణం బరాబర్ జరిగిందన్న మాట. దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికే తమ యువనేత, తెలంగాణ పోరాట యోధుడు మన్నె క్రిశాంక్ ఫోన్ సీజ్ చేశారు. దీన్నే పోలీసు భాషలో అటెన్షన్ డైవర్షన్ అంటారు.

ఈ గ్యాంగ్‌లు బ్యాంకుల ముందు తచ్చాడుతూ ఖాతాదారుల మీద రంగు చల్లి వాళ్ల పైసలనెత్తుకొని పారిపోతారు. ఈ గ్యాంగ్‌లు నేడు తెలంగాణలో రాజ్యమేలుతున్నవి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## జక్కంపూడి క్రిష్ణమూర్తిని పరామర్శించిన పార్టీల నాయకులు



**తల్లాడ, మార్చి 21 (ప్రజా జ్యోతి న్యూస్):**
తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి క్రిష్ణమూర్తి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. గురువారం ఆయనను తల్లాడ మండల నాయకులు పరామర్శించారు.త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, నాయకులు మారెళ్ల. లక్ష్మన్ రావు, ఎక్కిరాల సుదర్శన్, శీలం ముత్తా రెడ్డి, పగడాల నాగార్జున రెడ్డి, ఉప్పెర్ల రామారావు, ఏన్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, టీడీపీ మండల నాయకులు రావూరి. రవిప్రసాద్, దుగ్గినేని వెంకటేశ్వర్లు, వేముల గోవిందు, మొక్క క్రిష్టార్జున్,పోతురాజు. క్రిష్ణ గౌడ్ ఉన్నారు.

## ఖమ్మంలో రజాకార్ సినిమా యూనిట్ సందడి

**ఖమ్మం కల్చరల్ మార్చి 21 ప్రజా జ్యోతి**



దర్శకుడు ఎట్ట సత్యనారాయణ, హీరో రాజ అర్జున్, అనసూయ భరద్వాజ్ బాబీ సింహగొప్ప చారిత్రాత్మకమైన చిత్రం సమర క్రియేషన్ సమర్పించు రజాకర్ సినిమా యూనిట్ గురువారం రాత్రి ఖమ్మం ఆదిత్య థియేటర్ ని దర్శించి ప్రేక్షకులతో ముచ్చటించారు. దీంతో ఖమ్మంలో సినీ సందడి నెలకొంది. ఈ చిత్రానికి హాజరైన ప్రేక్షకులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అభివాదాలు తెలిపారు. సినీ దర్శకులు సత్యనారాయణ ,నటి నటులు బాబి సింహ, తేజ్ సప్రూవ్ అనసూయ భరద్వాజ అర్జున్ విజయ్, సినిమాటోగ్రఫీ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ఆదరించాలని తెలంగాణలో గత చరిత్రను చాటి చెప్పే సినిమా ఇదేనన్నారు.

